సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూపునకు ఇవ్వొద్దు..

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూపునకు ఇవ్వాలని చేస్తున్న ప్రయత్నాలను యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు మింట్ కాంపౌండ్‌లోని కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో యూనియన్ అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు మాట్లాడుతూ సౌత్ సర్కిల్‌లో కరెంటు చోరీ జరుగుతున్నదని, బిల్లులు సరిగ్గా కట్టడం లేదని, ఆదాయం తక్కువగా ఉందని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు చూడడం సరికాదన్నారు. సంస్థ బిల్లుల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ఉద్యోగులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని రాజకీయాలకు తలొగ్గకుండా డీపీఈ, విజిలెన్స్‌లను వినియోగించుకుంటూ పని చేస్తే తమ యూనియన్‌తో పాటు అన్నియూనియన్లు సహకరిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని ఉద్యోగులు పోరాడుతున్న నేపథ్యంలో ప్రైవేటు సంస్థలకు సౌత్ సర్కిల్‌ను కట్టబెట్టే ప్రయత్నాలని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ ప్రతినిధులు

బస్తీ దవాఖానాకు డ్రైనేజీ మురుగుతో సుస్తీ..

వర్షం వస్తే ముంపు తప్పదు.. పట్టించుకోని అధికారులు..

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానాల వద్ద పారిశుధ్య లోపం కనిపిస్తోంది. ఖైరతాబాద్ మహాభారత్‌గర్‌లోని బస్తీ దవాఖానా వద్ద డ్రైనేజీ పొంగుతూ రహదారి మొత్తం మురుగుతో నిండిపోవడంతో దవాఖాన లోనికి వెళ్లాలంటే మురుగులో అడుగులు వేయక తప్పడం లేదు. రెండు రోజులుగా ఇక్కడ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో పాటు ఇటీవలే ఇక్కడి కచ్చామోరీల్లోంచి పూడిక తీసి అక్కడే వేశారు. దాంతో మరింత దుర్వాసన వస్తోంది. ఇక వర్షం వస్తే ఈ బస్తీ దవాఖానా ముందు భాగం చెరువును తలపిస్తుంది. గతంలో ఇక్కడి నుంచి వర్షపునీరు పైప్‌లైన్ ద్వారా లేక్‌వ్యూ పార్కులోకి వెళ్లే వెసులుబాటు ఉండేది. అది పూడుకుపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా మోకాలిలోతు నీరు నిలిచిపోతున్నది. దవాఖాన బస్తీ లోపలి భాగంలో ఉండడంతో స్థానికులు ఆస్పత్రిని మూసిన అనంతరం అక్కడ చెత్తను, వ్యర్థాలను జారవిడుస్తున్నారు. ఆస్పత్రుల పరిసరాల్లో అపరిశుభ్రత, డ్రైనేజీల పొంగు, ముంపు సమస్యలు ఉన్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా బస్తీ దవాఖాన వద్ద పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


బస్తీ దవాఖాన ఎదుట డ్రైనేజీ మురుగు

దోమల నివారణకు చర్యలు చేపట్టండి

బోరబండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. గురువారం ఎంటమాలజీ అధికారి సంధ్యతో కలిసి ఆయన సున్నం చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సున్నం చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలన్నారు. చెరువులో కెమికల్ చల్లి, ఆయిల్ బాల్ వేయాలని అధికారులను ఆదేశించారు. సమీపంలోని బస్తీల్లో ఫాగింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


సున్నం చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ , ఎంటమాలజీ అధికారి సంధ్య

రెండు నెలల్లో అందుబాటులోకి రిజర్వాయర్

యూసుఫ్‌గూడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్, బోరబండ పరిసర ప్రాంతాల ప్రజల నీటి సమస్య పరిష్కారం కోసం చేపట్టిన రిజర్వాయర్ పనులు మరో రెండు నెలల్లో పూర్తవుతాయని స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన అధికారులతో కలిసి ఎస్పీఆర్‌హిల్స్‌లో నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్‌ను పరిశీలించారు. పనులు దాదాపుగా పూర్తయ్యాయని, తుదిమెరుగులు దిద్దుకుని అందుబాటులోకి రానుందని తెలిపారు. పనులు వేగవంతం చేసి రెండు నెలల్లో ప్రజల అవసరాలకు అందుబాటులోకి తీసురావాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి కోరామని తెలిపారు. ఈ రిజర్వాయర్ 30లక్షల లీటర్ల సామర్థ్యం ఉందని, ఇది అందుబాటులోకి వస్తే నీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాజేందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


ఎస్పీఆర్ హిల్స్‌లో నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పాటించాలి

బంజారాహిల్స్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పాటించాలని వేంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. శ్రీనగర్‌కాలనీలో రూ.81లక్షలతో నిర్మిస్తున్న వీడీసీసీ రోడ్డు పనులను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


కాలనీ వాసులతో మాట్లాడుతున్న మన్నె కవితారెడ్డి

ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మల తొలగింపు

బంజారాహిల్స్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఫిలింనగర్‌లోని అనేక చోట్ల కొమ్మలు విరిగి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఎవరి మీద పడుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. రౌండ్‌టేబుల్ పాఠశాల వద్ద కొమ్మలు విద్యుత్ తీగల మీద పడ్డాయి. తీగలు తెగితే విద్యుత్ షాక్ తగిలే అవకాశాలు ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసి డీఆర్ఎఫ్ సిబ్బంది గురువారం చెట్ల కొమ్మలను తొలగించారు.


చెట్ల కొమ్మలను తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

ఫ్యాన్సీ నంబర్ల వేలంలో
ఆర్టీఏకు రూ.18.28 లక్షల ఆదాయం

హైదరాబాద్ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఫ్యాన్సీ నంబర్ల వేలంలో ఆర్టీఏకు గురువారం రూ.18,28,797 ఆదాయం వచ్చింది. మొత్తం 5 ఫ్యాన్సీ నంబర్లకు అధికారులు బహిరంగ వేలం వేశారు. ఇందులో టీజీ10 9999 నంబర్‌ను మామిడి రాజశేఖర్‌రెడ్డి రూ.6,00,999 వేలకు గరిష్టంగా దక్కించుకున్నారు. అలాగే టీజీ10ఏ 0001 నంబర్‌ను రంజిత గోపీరావు యానిమాడుల రూ.3,60,000లకు పొందారు. వీరితోపాటు టీజీ10ఏ 0009 నంబర్‌ను మ్యాక్ ల్యాబ్స్ లిమిటెడ్ సంస్థ రూ.2,61,126కు, టీజీ10ఏ 0007 నంబర్‌ను శివకల్యాణ్ మేకల రూ.1,61,999కు, టీజీ10ఏ 0005 నంబర్‌ను రత్నదీప్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.51,500కు దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు.

వీధికుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

బంజారాహిల్స్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి నిర్మూలనకు జీహెచ్ఎంసీ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ కుర్రా సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అమీర్‌పేట కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీధికుక్కలు అధికమయ్యాయని, రాత్రివేళల్లో దాడులకు పాల్పడుతున్నాయని అన్నారు. వాటి నిర్మూలనకు సిబ్బందిని నియమించి చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా ఈ వర్షాకాలంలో దోమల నిర్మూలన, డ్రైనేజీ పునరుద్ధరణకు పనులను ముమ్మరం చేయాలని విజ్ఞప్తి చేశారు. నేతలు కుర్రా రమణయ్య, గంగా రవిచంద్రారెడ్డి, కోడిపల్లి కృష్ణ, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు

పాము పిల్ల కలకలం

పంజాగుట్ట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ జి-బ్లాక్‌లోని గురువారం ఓ ఇంటి వద్ద నాగుపాము పిల్ల కనిపించడంతో ఇంట్లో వారు ఆందోళన చెందారు. ఇంట్లో వారు స్థానిక కార్పొరేటర్ దేదీప్య దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్నేక్ క్యాచర్ థామస్ హనీకి సమాచారం అందించారు. స్నేక్‌క్యాచర్ మంచి నీటి బాటిల్‌లో పామును బంధించి తీసుకెళ్లాడు.


పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్

ఖైరతాబాద్ జోన్‌లో 51 డెంగీ కేసులు

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఇప్పటివరకు అధికారికంగా 51 డెంగీ కేసులు నమోదయ్యాయని జోనల్ కమిషనర్ (జడ్సీ) అనురాగ్ జయంతి అన్నారు. గురువారం జోనల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖైరతాబాద్, గోషామహల్ సర్కిళ్లలో 12 చొప్పున కేసులు నమోదయ్యాయని తెలిపారు. జోన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో 3 రోజుల్లో అవగాహన కార్యక్రమాలు పూర్తి చేయాలని లక్ష్యం విధించుకొని పనిచేస్తున్నామని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ చేస్తున్న పనిలో ప్రజల భాగస్వామ్యం ఉండేలా, జవాబుదారితనం పెరిగేలా చేస్తున్నామని అన్నారు. ప్రజలందరూ ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలన్నారు. పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరాలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. డెంగీ పోరాటంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పనితీరుపై నిఘాతో పాటు వారికి చేయూతనిచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న ఖైరతాబాద్ జడ్సీ అనురాగ్ జయంతి

దోమల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

అమీర్‌పేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాలు విజృంభించే అవకాశం ఉన్నందున దోమల నివారణకు ప్రతిపౌరుడు బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ జగన్ పిలుపునిచ్చారు. గురువారం అమీర్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంసీ జగన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వారానికి ఒకసారి తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మన చుట్టూ ఉన్న వాళ్లను కూడా అప్రమత్తం చేయాలన్నారు. ఒక దోమ జీవిత కాలం (30) రోజుల్లో సుమారు వెయ్యి గుడ్లు చొప్పున పెట్టి సంవత్సరానికి సుమారు 700 కోట్ల దోమలను ఉత్పత్తి చేస్తుందన్నారు. వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించి దోమలను లార్వా దశలో నే నిర్మూలించాలన్నారు. చిన్న ప్రాణులతో పెను ప్రమాదమని, దోమ కాటుతో ముప్పు పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. దోమ పుట్టకుండా.. కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సుధీర్‌చంద్ర, ఏఎంఎచ్‌వో ప్రవీణ, డీపీఓ శ్రీనివాస్, రజనీ, ట్యాక్స్ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ ఎంటమాలజీ భాస్కర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంసీ జగన్


యూసుఫ్‌గూడ లక్ష్మీనర్సింహనగర్‌లో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటాం..

యూసుఫ్‌గూడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీనర్సింహనగర్‌లో ఆయన పర్యటించారు. రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, విద్యుత్ సమస్యలు ఉన్నాయని, డ్రైనేజీ శాశ్వత పరిష్కారం చేయాలని, శునకాల బెడద విపరీతంగా ఉందని స్థానికులు విన్నవించారు. దీనికి స్పందించిన కిషన్‌రెడ్డి త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం ఉంటుందన్నారు. తనపై నమ్మకముంచి రెండోసారి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ప్రజలకు అన్ని రకాలుగా మరింత సేవ చేస్తామని తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్‌లు పర్యటిస్తామని తెలిపారు. మహిళలు ఆయనకు హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి, జూబ్లీహిల్స్ కన్వీనర్ కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, పులిరామ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి నవరాత్రుల వేడుకలు

బంజారాహిల్స్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాముండేశ్వరి అనుగ్రహ పీఠాధిపతి డాక్టర్ కృష్ణ చాముండేశ్వర ఆధ్వర్యంలో శ్రీనగర్‌కాలనీలోని ఆశ్రమంలో వారాహి అమ్మవారి నవరాత్రుల వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు పూజాదికాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదవారికి దుప్పట్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు.


వారాహి అమ్మవారిని దర్శించుకున్న మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు, కృష్ణ చాముండేశ్వర మహర్షి

తపాలా సేవలపై 13 నుంచి రెండు రోజుల శిబిరం

పంజాగుట్ట, జూలై11 (ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ అందిస్తున్న సేవలు, ఆధార్ కార్డులో మార్పు చేర్పులపై ఈనెల 13, 14తేదీల్లో ప్రేమ్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఖైరతాబాద్ పోస్ట్ ఆఫీస్ అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ ఇనర్సింగరావు తెలిపారు. ఆధార్ కార్డులో ఉన్న లోటుపాట్ల సవరణ,మార్పులు చేర్పులు, కొత్త దరఖాస్తుల స్వీకరణతో పాటు సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి ఇన్సూరెన్స్ పథకం, పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు. ఆధార్ సేవలు, పోస్ట్ ఆఫీస్ పథకాల కోసం ఆధార్ కార్డు, పాన్‌కార్డు, రెండు కలర్ ఫొటోలు తీసుకొని రావాలని ఆయన సూచించారు.

జోన్ బెస్ట్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ నాగ కార్తీక్

బంజారాహిల్స్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జనాభా నియంత్రణలో ఉత్తమ సేవలు అందించడంతో పాటు సరైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను బంజారాహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ నాగ కార్తీక్‌ను ఖైరతాబాద్ జోన్ బెస్ట్ మెడికల్ అవార్డు వరించింది. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాతా శిశు ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మజ, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి చేతుల మీదుగా ఆయన బెస్ట్ మెడికల్ ఆఫీసర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగ కార్తీక్ మాట్లాడుతూ గత మూడు పర్యాయాలు తనకు ఈ అవార్డు వరించిందని, ఈ అవార్డు తనకు మరింత ప్రోత్సాహాన్ని ఇవ్వడంతో పాటు బాధ్యతను పెంచిందని అన్నారు.


మాతా శిశు ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ పద్మజ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాగ కార్తీక్

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం కల్పిస్తాం

● అనిల్ కుమార్ యాదవ్

యూసుఫ్‌గూడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు మరింత ప్రోత్సాహం అందిస్తుందని రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ప్రముఖ రెజ్లర్ బొద్దం మహేష్‌యాదవ్ జ్ఞాపకార్థం ఇంటర్నేషనల్ రెజ్లర్ కిరణ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో అండర్-23 హైదరాబాద్ జిల్లా రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులతో పాటుగా కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీనియర్ నేతలు మనోజ్‌యాదవ్, భవానీ శంకర్, కిరణ్‌యాదవ్, ల్యాండ్ మార్క్ శ్రీనివాసరావు, రఘు యాదవ్, కార్పొరేటర్ వనం సంగీత యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కేవీబీఆర్ స్టేడియంలో రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్

మరదలు కనిపించటం లేదని ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న తన మరదలు కనిపించటంలేదని ఓ యువకుడు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాధవరావు, పావని దంపతులు ఉప్పల్‌లో నివాసం ఉంటున్నారు. పావని చెల్లెలు పల్లవి అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తూ హాస్టల్‌లో ఉంటోంది. ఈనెల 10న హాస్టల్‌లోని పల్లవి రూమ్‌మేట్ ఫోన్ చేసి పల్లవి కనిపించటం లేదని తెలిపింది. దీంతో మాధవరావు, పావనీలు హాస్టల్‌కు వచ్చి విచారించగా ఉదయం 5.30గంటలకు పల్లవి బ్యాగ్‌తో తన స్వగ్రామం వెళుతున్నాని చెప్పి వెళ్లిందని వార్డెన్ తెలిపింది. ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ రావడంతో పాటు స్వగ్రామానికి సైతం వెళ్లలేదని తెలిసింది, దీంతో మాధవరావు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దృష్టి మళ్లించి నగదు చోరీ

బంజారాహిల్స్, జూలై 11(ఆంధ్రజ్యోతి): కూరగాయల వ్యాపారి దృష్టి మళ్లించి గుర్తుతెలియని ఆగంతుకులు నగదు చోరీ చేశారు. షేక్‌పేటకు చెందిన గుర్రం సబిత (వృద్ధురాలు) కూరగాయల వ్యాపారం చేస్తోంది. ఈ నెల 10న ఫిలింనగర్‌లోని వినాయకనగర్‌లో క్యారెట్లను విక్రయించి వచ్చిన డబ్బు రూ.15 వేలను లెక్కబెడుతుండగా ముగ్గురు వ్యక్తులు ఆటోలో వచ్చారు. అందులో ఒకరు కిలో క్యారెట్ కావాలని అడిగారు. సబిత క్యారెట్లు తూకం చేసి ప్యాకింగ్ చేసి ఇచ్చేలోపు డబ్బు తీసుకొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణం వద్ద ఫిట్స్‌తో వ్యక్తి మృతి

బంజారాహిల్స్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని వ్యక్తి మోతీనగర్ వైన్‌షాప్ వద్ద మృతి చెందిన సంఘటన జరిగింది. ఈనెల 10న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఓ వ్యక్తి మోతీనగర్‌లోని ఓ వైన్ షాపులో మద్యం కొనుగోలుచేసి వెళుతుండగా ఫిట్స్ రావడంతో ఆ దుకాణం ఎదుటే పడిపోయాడు. దుకాణం నిర్వాహకులు వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేశారు అంబులెన్స్ సిబ్బంది అతన్ని పరీక్షించి అప్పటికే చనిపోయాడని నిర్ధారించారు. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నా భార్య చేయి పట్టుకుంటావా..
అన్నందుకు వ్యక్తిపై దాడి

యూసుఫ్‌గూడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నా భార్య చేయి ఎందుకు పట్టుకున్నావని ప్రశ్నించినందుకు ఓ వ్యక్తిపై కొందరు దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరినగర్‌లో నివసించే ఎం.రాజు సినీ ఆర్టిస్టుగా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 9న రాజు బాత్‌రూంలో స్నానం చేస్తుండడాన్ని గమనించిన ఓ యువకుడు ఇంట్లో ఉన్న అతని భార్య చేయి పట్టుకుని లాగుతూ దుర్భాషలాడాడు. ఆమె వేసిన కేకలకు రాజు ఇంట్లోకి రాగా.. పారిపోతున్న సదరు యువకుడిని పట్టుకున్నాడు. అయితే, అతను తెలిసిన వ్యక్తి రాజా అల్లుడుగా గుర్తించాడు. వెంటనే సదరు యువకుడిని జవహర్‌నగర్‌కు తీసుకువెళ్లి వారి బంధువులకు జరిగిన విషయాన్ని తెలియజేస్తుండగా ఆ ఇంట్లోని యువకులు రాజా, సునీల్, కిశోర్, సుమిత్‌లు కలిసి రాజును కొట్టి గాయపరిచారు. దీంతో బాధితుడు గురువారం మధురానరగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

● కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ నిరసన

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడం శోచనీయమని, వెంటనే వాటిని విడుదల చేసి విద్యార్థుల ఉన్నత చదువులను ప్రోత్సహించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. గురువారం స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో గత 5 సంవత్సరాల నుంచి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8వేల కోట్లకు చేరుకున్నాయని, కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం సైతం విద్యార్థుల చదువు విషయమై అశ్రద్ధ చూపడం సరికాదని అన్నారు. వెంటనే నిధులను విడుదల చేయకపోతే సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ కార్యదర్శి అశోక్‌రెడ్డితో పాటు ప్రతినిధులు లెనిన్, స్టాలిన్, చరణ్‌శ్రీ, సునీల్, విఘ్నేష్, వంశబూ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

వాసెక్టమీ ఆపరేషన్లను విరివిగా చేయాలి

● డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ వెంకటి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటి

హైదరాబాద్ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణలో పురుషుల పాత్ర పెంచాలని, వాసెక్టమీ ఆపరేషన్లను విరివిగా చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి సూచించారు. హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాలను గురువారం డీఎంఅండ్‌హెచ్ఓలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పద్మజ హాజరై మాట్లాడారు. జనాభా పెరుగుదల వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. వివాహ వయస్సు, తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ నర్సింగ్ విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అపర్ణ, అధికారులు రాములు, ఆనంద్‌కుమార్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్, లైట్లు తదితర సామగ్రి అందజేస్తున్న టి.ఎన్.శ్రీనివాస్

పేద విద్యార్థులకు అండగా ఉంటా: టీఎన్ శ్రీనివాస్

సికింద్రాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అండగా ఉంటానని బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అన్నారు. కంటోన్మెంట్ 2వ వార్డు రసూల్‌పురా కట్టమైసమ్మ అంగన్‌వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాన్, ట్యూబ్‌లైట్లు, డోర్ మ్యాట్లను ఆయన విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారంలో భాగంగా వీటిని అందజేసినట్టు వెల్లడించారు. కుమార్‌ముదిరాజ్, శ్యాంరెడ్డి, కుమార్‌గౌడ్, షీలాబాయి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.



రసూల్‌పురా బస్తీలో యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళల హక్కులు, ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. చట్టం కల్పించిన హక్కులు తెలుసుకుంటూ, వాటిని సద్వినియోగం చేసుకుని, రక్షణ పొందాలని మహిళలకు సూచించారు. టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి వేధింపులపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సైబర్ క్రైమ్ నుంచి రామ్, డబ్ల్యూసీడీ నుంచి రఖాన్సీ హాజరయ్యారు. -(సికింద్రాబాద్-ఆంధ్రజ్యోతి)


సమావేశంలో పాల్గొన్న మహిళలు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : శైలజ

అడ్డగుట్ట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మహిళా అభివృద్ధి శాఖ అధికారి శైలజ సూచించారు. ఏవైనా ఇబ్బందులు వస్తే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు గురువారం తుకారాంగేట్ వడ్డెరబస్తీలో నిర్వహించిన మహిళల హక్కుల సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందించే సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా అభివృద్ధి శాఖ అధికారి శైలజ సూచించారు. కార్యక్రమంలో యాక్షన్‌ఎయిడ్ సంస్థ కో-ఆర్డినేటర్ సుమతితో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.


డాక్టర్ సుప్రియను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మారేడుపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కార్ఖాన న్యూ వాసవినగర్‌లో ఉమెన్ కేర్ క్లినిక్‌లో గురువారం వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు, వాసవీయన్ గోల్డ్ స్టార్ ఆర్.రవిచంద్రన్ పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. న్యూ వాసవీనగర్ కాలనీ ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన స్త్రీలకు గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం.సుప్రియ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ ఇన్‌చార్జి మంచికంటి ప్రకాస్, ప్రోగ్రాం ఇన్‌చార్జి రాయికంటి రాజేశ్వర్‌రావు, అధ్యక్షులు గోపిశెట్టి గౌరీశంకర్, కార్యదర్శి ఎం.అమర్నాథ్, ప్రాజెక్ట్ చైర్మన్ మరిపల్లి మాణిక్య ప్రభు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తుకారాంగేట్ చౌరస్తాలో ట్రాఫిక్‌ను మళ్లించండి

● నో ఎంట్రీ బోర్డును ఏర్పాటు చేయండి

● మారేడుపల్లి ట్రాఫిక్ సీఐకి బీజేపీ నేత వినతి

అడ్డగుట్ట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్ ఆర్‌యూబీ వద్ద ట్రాఫిక్ మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని మారేడుపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌కు బీజేపీ సీనియర్ నాయకుడు వి.నర్సింగ్‌రావు గురువారం వినతి పత్రం అందజేశారు. ఉదయం సాయంత్రం వేళల్లో అత్యంత రద్దీగా ఉండే తుకారాంగేట్, చౌరస్తా, అడ్డగుట్ట చౌరస్తా, అడ్డగుట్ట పెట్రోల్ బంకు వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. తుకారాగేట్ చౌరస్తాలో ఉన్న మిలిట్రీ రైల్వే ట్రాక్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. హనుమాన్‌పేట్ నుంచి తుకారాంగేట్ (ఆర్‌యూబీ) బ్రిడ్జి వైపు వచ్చే వాహనాలను లాలాగూడ రైల్వేస్టేషన్ మీదుగా తుకారాగేట్ వరకు, ట్రాఫిక్‌ను మళ్లించి ఆర్‌యూబీ బ్రిడ్జి వద్ద నో-ఎంట్రీ బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తుకారాంగేట్ ఆర్‌యూబీ బ్రిడ్జితో పాటు అడ్డగుట్ట చౌరస్తా, అడ్డగుట్ట పెట్రోల్ పంపు వద్ద ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తాం

● ఎమ్మెల్యే శ్రీగణేష్


బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయిన్‌పల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో అభివృద్ధి చేస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బోయిన్‌పల్లి జిల్లా పరిషత్ బాలబాలికల పాఠశాలలో తెలంగాణ ప్రగతి సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నర్సింగ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే శ్రీగణేష్ బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, కంటోన్మెంట్‌బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, టీపీసీసీ సెక్రటరీ బద్దం బల్వంత్‌రెడ్డి హాజరై విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల పోటీల్లో కూడా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ ముదిరాజ్, క్రాంతి ముదిరాజ్, సయ్యద్, రియాజ్ ఉద్దీన్, సదా, మారుతిగౌడ్, హరికృష్ణ, ఓంప్రకాష్, అమీర్, అరుణ్‌యాదవ్, శిశుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీనాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు..

మారేడుపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీనాన్ని స్థానికులు స్వాగతిస్తున్నారని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గురువారం కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని వాసవినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు అందజేశారు. డ్రైనేజీ, రోడ్లు, మంచి నీరు సమస్య, దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కోటా నిధులతో మూడు బోర్లు తమ కాలనీకి మంజూరు చేయాలని కోరారు. తమ కాలనీలోనికి రాకుండా కార్ఖాన ప్రధాన మార్గంలో వన్ వేలో భాగంగా ట్రాఫిక్ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారని, దీంతో అరకిలోమీటర్ దూరం అదనంగా వెళ్లి తమ ప్రాంతానికి చేరుకోవలిసిన పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ సభ్యులతో కలిసి ఓల్డ్ వాసవీనగర్‌లో ఎమ్మెల్యే పర్యటించి, స్థానికుల ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జె.నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు బొజ్జ అజయ్, అసోసియేషన్ ప్రతినిధులు భాస్కర్, తెలుకుంట అరుణ్ జ్యోతి, సతీష్‌గుప్తా, భాస్కర్, నాగేశ్వర్‌రావు, రేపాల వెంకటేశ్వర్లు, రవికాంత్, శ్రీనివాస్, అమర్నాథ్, వసుందర, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి


ప్రసంగిస్తున్న సంఘ్ అధ్యక్షుడు ప్రభాకర్ అంద్రూస్

చిలకలగూడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): నూతన పెన్షన్ స్కీం తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే, ఎంప్లాయీస్ సంఘ్ అధ్యక్షుడు ప్రభాకర్ అంద్రూస్, సహాయ కార్యదర్శి భరణీ భానుప్రసాద్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ రైల్ నిలయం ఎదుట గురువారం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమన్, దక్షణమధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య ఆదేశాల మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ కార్మిక వ్యతిరేక ధోరణి మాని రానున్న పార్లమెంటు సమావేశాల్లో పాత పెన్షన్ అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైల్వే కార్మికులు, ఉద్యోగులు ఒక రోజు సమ్మె చేస్తే దేశం స్తంభించి, కోట్లాది రుపాయలు నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. వెంటనే యుద్ధ ప్రాతిపాదికన సమస్య పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు రుద్రారెడ్డి, కె.వి.ఆర్.ప్రసాద్, మీడియా ప్రతినిధి షేక్ రవూఫ్ పాల్గొన్నారు.

విద్యుత్ సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూపునకు ఇవ్వొద్దు


నిరసన తెలుపుతున్న యూనియన్ ప్రతినిధులు

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూపునకు ఇవ్వాలని చేస్తున్న ప్రయత్నాలను యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు మింట్ కాంపౌండ్‌లోని కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. సౌత్ సర్కిల్‌లో కరెంటు చోరీ జరుగుతున్నదని, బిల్లులు సరిగా కట్టడం లేదని, ఆదాయం తక్కువగా ఉందని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. సంస్థ బిల్లుల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ఉద్యోగులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని రాజకీయాలకు తలొగ్గకుండా డీపీఈ, విజిలెన్స్‌లను వినియోగించుకుంటూ పనిచేస్తే అన్ని యూనియన్లు సహకరిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని ఉద్యోగులు పోరాడుతున్న నేపథ్యంలో ప్రైవేటు సంస్థలకు సౌత్ సర్కిల్‌ను కట్టబెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

● కలెక్టరేట్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ నిరసన


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడం శోచనీయమని, వెంటనే వాటిని విడుదల చేసి విద్యార్థుల ఉన్నత చదువులను ప్రోత్సహించాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. గురువారం స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5 సంవత్సరాల నుంచి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లకు చేరుకున్నాయన్నారు. వెంటనే నిధులను విడుదల చేయకపోతే సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ కార్యదర్శి అశోకొరెడ్డితో పాటు ప్రతినిధులు లెనిన్, స్టాలిన్, చరణ్‌శ్రీ, సునీల్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.


అసదుద్దీన్ ఒవైసీతో ఆర్. కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కేంద్రం బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోంది

● పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని అసదుద్దీన్ ఒవైసీతో ఆర్. కృష్ణయ్య చర్చలు

రాంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పూర్తయిన బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో జనాభా ప్రకారం వాటా దక్కడం లేదని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో దారుసలాంలో ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం గురువారం చర్చించింది. అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని కోరారు. రాజకీయ రంగంలో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ద్వారా తెలిసిందన్నారు. 56 శాతం జనాభా గల బీసీలకు రాజకీయ రంగంలో 14 శాతం, ఉద్యోగ రంగంలో 9 శాతం, పారిశ్రామిక రంగలో ఒక శాతం, ప్రైవేట్ రంగంలోని ఉద్యోగాలలో 5 శాతం కేటాయించాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఎంఐఎం పక్షాన ప్రైవేట్ బీసీ బిల్లు పెడతామని అసదుద్దీన్ ఒవైసీ హామీ ఇచ్చారని ఆర్. కృష్ణయ్య తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు అనంతయ్య, సి.రాజేందర్, కోలా జనార్దన్, శివ ముదిరాజ్ పాల్గొన్నారు.

ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలంటూ మోసం

● నగర వాసి నుంచి రూ.8.99లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే.. అధికలాభాలు వస్తాయంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగిని మోసం చేశారు. పెట్టుబడుల పేరుతో రూ. 8.99 లక్షలు కాజేశారు. డీసీపీ కవిత ధార తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 34 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగికి ఫేస్‌బుక్‌లో ఒక ప్రకటన కనిపించింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయంటూ అందులో రాసి ఉంది. బాధితుడు ప్రకటనలో ఉన్న ఫోన్ నంబర్‌లలో సంప్రదించాడు. స్పందించిన గుర్తుతెలియని వ్యక్తులు అతడి ఫోన్ నంబర్‌ను ఎవర్‌కోర్ ఫుల్ స్టాక్ పుల్లింగ్ గ్రూపు, వీఐపీ కన్సల్టేషన్ సర్వీస్-34 గ్రూపుల్లో యాడ్ చేశారు. ఆ తర్వాత ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఏటీఎం కార్డులను వాట్సాప్‌లో తెప్పించుకున్న నేరగాళ్లు అతడితో ఎఫ్‌వైఎస్‌ఎల్‌టీడీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఆ తర్వాత దశలవారీగా పెట్టుబడులు పెట్టించారు. మొదట్లో లాభాలు వచ్చినట్లు చూపించి విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. అలా రూ.86,041 లాభాల రూపంలో విత్ డ్రా చేసుకున్నాడు. దాంతో అతడికి మరింత నమ్మకం కలిగింది. ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో బాధితుడు దశలవారీగా 8.99 లక్షలు పెట్టుబడి పెట్టాడు. డబ్బులు చేతికి అందిన తర్వాత నిందితులు విత్‌డ్రా ఆప్షన్ క్లోజ్ చేశారు. బాధితుడు ప్రశ్నించగా.. పెట్టుబడి పెట్టమంటున్నారే తప్ప విత్‌డ్రా ఆప్షన్ ఇవ్వడం లేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యను పరిష్కరించాలని వినతి



తార్నాక డివిజన్ ఆర్యనగర్‌లో రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బస్తీవాసులు గురువారం నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డిని తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

- తార్నాక, జూలై 11(ఆంధ్రజ్యోతి

మహాకాళి ఆలయానికి రంగులు



ఈనెల 21, 22వ తేదీల్లో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవాదాయశాఖ సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా ఆలయానికి రంగులు వేసి, అందంగా ముస్తాబు చేస్తున్నారు.

- సికింద్రాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి)

మానవత్వాన్ని చాటుకున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

● పిట్స్ వచ్చిన వ్యక్తికి ప్రథమ చికిత్స, ఆస్పత్రికి తరలింపు


రోడ్డుపైన పడిపోయిన వ్యక్తి వివరాలు తెలుసుకుంటున్న బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య

బోయిన్‌పల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బస్టాప్ నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడికి (పిట్స్) మూర్ఛవచ్చి పడిపోవడంతో గమనించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించారు. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన శివ అనే యువకుడు గురువారం మధ్యాహ్నం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి వైపు వెళ్లేందుకు బోయిన్‌పల్లి తాడ్‌బంద్ చౌరస్తాలో బస్ దిగాడు. పక్కనే ఉన్న మరో బస్సు ఎక్కేందుకు వెళ్తుండగా మూర్ఛ వచ్చింది. ఇదే సమయంలో అటువైపుగా నంబర్ ప్లేట్ లేకుండా అతివేగంగా వెళ్తున్న ఓ ఖరీదైన వాహనాన్ని పట్టుకోవడానికి వెళ్తున్న బోయిన్‌పల్లి ట్రాపిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య రోడ్డు పక్కన పడిపోయి ఉన్న వ్యక్తిని గమనించి వెంటనే అతనికి ప్రథమ చికిత్స అందించారు. బంధువులకు సమాచారం ఇచ్చారు. అనంతరం చికిత్స నిమిత్తం కిమ్స్ అస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య సిబ్బంది చేసిన సాయానికి బాధితుడి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.


మత్తులో దుడ్డుకర్రతో హల్‌చల్ చేసిన గుర్తుతెలియని వ్యక్తి


పాదచారులపై దాడి చేస్తున్న దృశ్యం

వైట్‌నర్, మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

● దుడ్డుకర్రతో పాదచారులపై దాడి

● ఐదుగురికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు

అడ్డగుట్ట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా గండిమైసమ్మ ఆలయం వద్ద ఓ వ్యక్తి వైట్‌నర్, మద్యం మత్తులో పాదచారులపై దుడ్డుకర్రతో దాడికి పాల్పడ్డాడు. గోపాలపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా రెజిమెంటల్‌బజారులో గండిమైసమ్మ ఆలయం వద్ద బుధవారం రాత్రి 11గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వైట్‌నర్, మద్యం తాగి హల్‌చల్ చేశాడు. మత్తులో పాదచారులపై కర్రతో దాడి చేయడంతో భయాందోళనకు గురైన స్థానికులు పరుగులు తీశారు. దాదాపు ఐదుగురు పాదచారులపై దాడికి పాల్పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గోపాలపురం పోలీసుల సంఘటనా స్థలానికి రాగా పోలీసువ్యాన్‌ను చూసి వైట్‌నర్ సేవించే గ్యాంగ్ పరారైంది. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్


రైల్వేస్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగలను పట్టుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సెల్‌ఫోన్‌లను దొంగలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆర్‌పీఎఫ్ శక్తి మహిళా బృందం కానిస్టేబుళ్లు అరెస్టు చేశారు. బేగంపేట్ ఆర్‌పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి సికింద్రాబాద్ డివిజన్ ఆర్‌పీఎఫ్ శక్తిటీం మహిళా కానిస్టేబుళ్లు మాధురిసింగ్, రాధతో పాటు సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసుల ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు వద్ద నిఘాపెట్టారు. ఈ సందర్భంగా ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.27 వేల విలువ చేసే సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న జీఆర్‌పీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న పాత నేరస్థుడి అరెస్ట్

మారేడుపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న పాత నేరస్థుడిని పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన దూసరి నవీన్‌గౌడ్(35) మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నాడని గతంలో అక్కడి ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలోనే నవీన్‌కు గంజాయి, హాష్ ఆయిల్‌ను విక్రయించే అరకునకు చెందిన యేసయ్యతో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలైన తర్వాత నవీన్ అరకు లంబసింగికి వెళ్లి యేసయ్య వద్ద రూ. 50,000 విలువ చేసే హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి నగరానికి తిరిగి వచ్చి జేబీఎస్‌లో దిగాడు. హాష్ ఆయిల్‌ను నగరంలోని వివిధ ప్రాంతాల్లో, ఆర్టీసీ క్రాస్‌రోడ్ వద్ద విక్రయించేందుకు నవీన్ ప్రయత్నిస్తుండగా అతడిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 825 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం నిందితుడిని మారేడుపల్లి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న మారేడుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్మింగ్ పూల్‌కు షాక్..

● 18 మందికి స్వల్ప గాయాలు

పహాడిషరీఫ్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సరదా కోసం స్విమ్మింగ్ పూల్‌లో దిగిన పలువురుగాయపడ్డారు. ఈ సంఘటన పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జల్‌పల్లిలో గురువారం సాయంత్రం మరాఠా భవన్ సమీపంలోగల ఫామ్‌హౌస్‌లో ఓ కుటుంబం విందు చేసుకుంది. అనంతరం ఫామ్‌హౌస్ ప్రాంగణంలోని స్విమింగ్‌పూల్‌లో 18 మంది సరదాగా ఈత కొడుతున్నారు. ఈ క్రమంలో స్విమింగ్‌పూల్‌పై నుంచి ఉన్న హై టెన్షన్ వైర్లు గాలికి కింద ఉన్న ఈత చెట్టు కొమ్మకు తగలడంతో కాలిపోయింది. ఈత చెట్టుకు తాకిన వైర్ల ద్వారా స్విమింగ్‌పూల్ లోపలికి ఎర్త్ రావడంతో ఈత కొడుతున్న వారు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. కుటుంబ సభ్యులు, స్థానికులు వారిని మైలార్‌దేవ్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. 16 మంది డిశ్చార్జి అయ్యారు. ఇద్దరు చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

అమీర్‌పేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాలు విజృంభించే అవకాశం ఉన్నందున దోమల నివారణకు ప్రతిపౌరుడు బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ జగన్ పిలుపునిచ్చారు. గురువారం అమీర్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంసీ జగన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వారానికి ఒకసారి తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మన చుట్టూ ఉన్న వాళ్లను కూడా అప్రమత్తం చేయాలన్నారు. ఒక దోమ జీవిత కాలం (30) రోజుల్లో సుమారు వెయ్యి గుడ్లు చొప్పున పెట్టి సంవత్సరానికి సుమారు 700 కోట్ల దోమలను ఉత్పత్తి చేస్తుందన్నారు. వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించి దోమలను లార్వా దశలో నే నిర్మూలించాలన్నారు. చిన్న ప్రాణులతో పెను ప్రమాదమని, దోమ కాటుతో ముప్పు పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. దోమ పుట్టకుండా.. కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సుధీర్‌చంద్ర, ఏఎంహెచ్‌వో ప్రవీణ, డీపీఓ శ్రీనివాస్, రజనీ, ట్యాక్స్ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ ఎంటమాలజీ భాస్కర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.